క్లుప్తంగా

నేడు మంత్రి రోజా పర్యటన

నగరి: నియోజకవర్గంలో శనివారం పలు కార్యక్రమాల్లో మంత్రి ఆర్కేరోజా పాల్గొననున్నారు. ఉదయం 9.00 గంటలకు పుత్తూరు మండలం ఉత్తరపుకండ్రికలో రూ.21.80 లక్షల నిధులతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనాన్ని ప్రారంభిస్తారు. అనంతరం విజయపురం మండలం కోసలనగరంలో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ప్రారంభిస్తారు. సాయంత్రం 6.30 గంటలకు నగరిలో శ్రీ దేశమ్మ దేవాలయ కుంభాభిషేక ఉత్సవాల్లో భాగంగా ఆలయానికి వేలూరు గోల్డెన్ టెంపుల్ స్వామి శక్తి నారాయణి అమ్మవారు విచ్చేసే సందర్భంగా భారీఎత్తున నిర్వహించే పూజా కార్యక్రమాల్లో మంత్రి పాల్గొంటారు.

గణిత జన విజ్ఞాన వేదికపై అవగాహన


అరుణ్ శివప్రసాద్‌ను సన్మానిస్తున్న హెచ్ఎం, టీచర్లు

పాలసముద్రం: మండలంలోని తిరుమలరాజుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం జన విజ్ఞాన వేదిక, ఏపీఎంఎఫ్, ఎస్టీయూ ఆధ్వర్యంలో గణిత అవధాని అరుణ్ శివప్రసాద్ శిష్య బృందం గణిత అవధాని కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీఆర్ పురం హెచ్ఎం దీనదయాల్, టీచర్లు సుధాకర్, మురుగదాస్, శ్రీనివాస్, ఎస్టీయూ నాయకులు కుమార్, ప్రకాష్, వెంకటేష్, ఏలుమల్లై, అరుణ్ శిష్య బృందాలు, గణితావధాని అరుణ్ శివప్రసాద్‌ను సన్మానించారు.

అభివృద్ధి పథంలో గ్రామాలు

విజయపురం (నగరి): మంత్రి ఆర్కే రోజా సహకారంతో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయని విజయపురం మండలం కోసలనగరం సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు నార్పరాజు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తమ పంచాయతీలో సుమారు రూ.40 లక్ష వ్యయంతో సచివాలయం, ఆర్‌బీకే కేంద్రాలు నిర్మించడమే ఇందుకు ఉదాహరణ అని తెలిపారు. కోసలనగరం నుంచి జంబాడ మీదుగా తారురోడ్డు వేయించారన్నారు. నేడు కోసలనగరంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించేందుకు విచ్చేస్తున్న మంత్రి ఆర్కే రోజా కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున విచ్చేసి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి


సన్మానం అందుకున్న తహసీల్దార్ ఆల్‌ఫ్రెడ్

శ్రీరంగరాజపురం: మండలంలోని ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఆల్ ఇండియా సమాచార హక్కు చట్టం సంఘం అధ్యక్షుడు పట్టాభి అన్నారు. నూతన తహసీల్దార్ ఆల్‌ఫ్రెడ్‌ను, కార్వేటినగరం పోలీసు అధికారి సీఐ సత్యబాబును కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రజా సమస్యలతో కూడిన వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు సెల్వరాజ్, ఆర్టీఐ సభ్యులు రాంప్రకాష్, నీలా వతి, శంకర్, గీత, గిరిబాబు, హరినాథరెడ్డి, బాలాజి, బాబు, పుష్పరాజ్ పాల్గొన్నారు.

వైభవంగా తై అమావాస్య పూజలు


విశేషాలంకరణలో సొరకాయలస్వామి

నారాయణవనం: మండలంలోని పలు ఆలయాల్లో గురువారం తమిళ తై మాసం సందర్భంగా అమావాస్య పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. దక్షణాయనంలో మహాలయ అమావాస్యకు ఉన్నంత ప్రాధాణ్యం ఉత్తరాయణంలో సంక్రాంతి తరువాత వచ్చే తొలి అమావాస్యకు అంతే ప్రాముఖ్యత ఇస్తారు. మండల కేంద్రంలోని అవధూత శ్రీసొరకాయలస్వామి ఆలయంలో బుధవారం రాత్రి హోమగుండ పూజ, రథోత్సవం, ఊయ్యాలసేవ నిర్వహించారు. తమిళనాడు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గురువారం ఉదయం శ్రీసొరకాయలస్వామికి ప్రత్యేక అభిషేకం నిర్వహించి సుగంధ భరిత పుష్పమాలికలు, స్వర్ణాభరణాలు, పట్టుపీతాంబరాలతో సుందరంగా అలంకరించి పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్న ప్రసాదాలను వితరణ చేశారు. ఆలయంలో ప్రతి గురువారం, అమావాస్య, పౌర్ణమి రోజుల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అభివృద్ధి కమిటీ తెలిపింది. అలాగే స్థానిక వీరరాఘవస్వామి ఆలయంలో అమావాస్య పూజల్లో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో సామూహిక అర్చనలు, పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలను అందుకున్నారు.

భక్తజన సంబరం



- నయనానందకరంగా దేశమ్మ ఆలయ కుంభాభిషేకం
- సారె సమర్పించిన మహిళలు

దేశమ్మ తల్లీ పాహిమాం నామ స్మరణలు.. వేదమంత్రోచ్ఛారణలు.. భక్త బృందాలు, కళా బృందాల ప్రదర్శనలు .. మంగళవాయిద్యాల నడుమ నేత్ర ప్రదాయని శ్రీదేశమ్మ ఆలయ మహాకుంభాభిషేక ఉత్సవాలు ఐదవ రోజైన శుక్రవారం నేత్రపర్వంగా సాగాయి.


సారెను ఊరేగింపుగా తీసుకువస్తున్న మహిళలు, (ఇన్‌సెట్) యాగశాలలో పూజలు

నగరి: రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రాలు ఎన్నో ఉన్నాయి. అందులో వేటికి అవే చాలా ప్రత్యేకం. అలాంటి వాటిలో కళ్లకు ప్రసిద్ధి గాంచిన ఆలయం నేత్ర ప్రదాయిని శ్రీదేశమ్మ దేవత క్షేత్రం. అమ్మవారి అభిషేక తీర్థాన్ని ఇక్కడ కళ్లలో చల్లుతారు. ఎలాంటి కంటి దోషాలున్నా ఈ తీర్థం కళ్లలో చల్లుకుంటే నివారణ అవుతాయని దశాబ్దాలుగా భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఎన్నో నిదర్శనాలు కూడా ఉన్నాయి. భక్తులకు ఇక్కడ సీసాల్లో కూడా తీర్థాన్ని అందజేస్తారు. ఎన్నో విశేషాలు గల ఈ ఆలయ కుంభాభిషేకోత్సవాలు నయనానందకరంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం సౌభాగ్యసూక్త హోమం, చండీపారాయణం, చండీహోమం, వనదుర్గా మహావిద్యపారాయణం, పంచ గవ్యాదివాసం కార్యక్రమాలు నిర్వహించారు.

సారె సమర్పణ

కుంభాభిషేక ఉత్సవాల్లో భాగంగా పట్టణ పరిధి 4,5 వార్డులకు చెందిన మహిళలు చీరలు, గాజులు, పసుపు కుంకుమ సారెతో పోతురాజు ఆలయం వద్ద నుంచి కళాప్రదర్శనగా అమ్మవారి ఆలయం వరకు ఊరేగింపుగా రావడం ప్రత్యేకతను సంతరించుకుంది. భక్తిశ్రద్ధలతో తాము తెచ్చిన సారెను అమ్మవారికి సమర్పించారు. ఆలయంలో జరుగుతున్న హోమపూజల్లో పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ ఛైర్మన్ వేణుబాబు, ఈవో రామచంద్రయ్య, కమిటీ సభ్యులు రాజేంద్రన్, పాండురంగం, ఆర్ముగం, విజయ్, లత, కోకిల, అనిత, పూర్ణిమ పర్యవేక్షించారు. కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, దయానిధి, అర్చకులు నీలకంఠం, చెంచురామయ్య, పురుషోత్తం, గుణశేఖర్ పాల్గొన్నారు.



ఊరేగింపులో కళా ప్రదర్శనలు

స్వచ్ఛమైన తాగునీటితో ఆరోగ్యం


వాటర్ ప్లాంట్ ప్రారంభించి మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పాలసముద్రం: ప్రభుత్వం స్వచ్ఛమైన తాగునీరు అందించి ప్రజలను సంపూర్ణ రోగ్యవంతులుగా ఉంచాలన్న ఉద్దేశంతో ఆర్ఓ వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేస్తోందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. పాలసముద్రం బీసీ కాలనీలో శుక్రవారం ఆర్ఓ వాటర్‌ప్లాంట్, సింగిల్ విండో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన డీసీసీబీ ఏటీఎంను సింగిల్ విండో అధ్యక్షురాలు గాలిజ్యోతి, జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, మండల కన్వీనర్ తులసి యాదవ్ ఆధ్వర్యంలో ప్రాంభించారు. డిప్యూటీ సీఎం కె నారాయణస్వామి మాట్లాడుతూ మండలంలో జలజీవన్ మిషన్ ద్వారా 20 తాగునీటి ట్యాంకులు రూ.3.5 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. ఎన్నో పార్టీలు అధికారంలోకి వచ్చినప్పటికీ వైఎస్సార్ సీపీ వచ్చిన తరువాత మాత్రమే పాలసముద్రంలో ఏటీఎం తీసుకొచ్చామని తెలిపారు. మండల ప్రజలు ఏటీఎంను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఇవే కాకుండా రాచపాళెం నుంచి వనదుర్గాపురం, ఎల్ఎస్ పురం నుంచి టీపీఎస్ఆర్ పురం పంచాయతీలకు కొన్ని ఏళ్ల తరబడి మండల కేంద్రాలకు తమిళనాడు మీదుగా ప్రజలు రాకపోకలు సాగిస్తూ అవస్థలు పడేవారని గుర్తుచేశారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎం అయ్యాక అటవీ అనుమతులు తీసు


డీసీసీబీ ఏటీఎంను పారంభిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కొచ్చి రోడ్డు వేయడంతో, ఇప్పుడు 15 నిముషాల్లో మండల కేంద్రానికి ప్రజలు వస్తున్నారని చెప్పారు. తిరుమలరాజుపురం, గంగమ్మపురం, నరసింహపురం, కోదండరామపురం, టీపీఎస్ఆర్ పురం పంచాయతీల్లో రైతులు సాగునీటికి ఇబ్బందులు పడకుండా మామిడిమాను మడుగు ప్రాజెక్టు పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు వివరించారు. అనంతరం ఆర్ఓ వాటర్‌ప్లాంట్, డీసీసీ బ్యాంకు ఏటీఎంను బ్యాంకు సిబ్బంది, స్థానిక సర్పంచ్ అయ్యప్పతో కలసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామనాథరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ మదుబాబు, ఏఓ డిల్లీప్రసాద్, హౌసింగ్ ఏఈ దాము, ఎంపీటీసీ గోవిందరాజు, లిఖిత, సింగిల్ విండో డైరెక్టర్లు రాణి, లిల్లీఅరునాదన్, సర్పంచ్‌లు భాష్కర్‌రెడ్డి, గాలి మహేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి రోజా చొరవతో రోడ్లకు మోక్షం


ఆది ఆంధ్రవాడ రోడ్డు


శ్రీహరిపురం ఎస్టీ కాలనీలో రోడ్డు పనులు

విజయపురం (నగరి): మండలంలో ఆర్కే రోజా ట్రస్ట్ కింద పలు గ్రామీణ రోడ్లకు మోక్షం లభించింది. మల్లారెడ్డికండ్రిగ నుంచి ఆదిఆంధ్రవాడ, శ్రీహరిపురం నుంచి లక్ష్మీవిలాసపురం, శ్రీహరిపురం నుంచి ఎస్టీ కాలనీకి వెళ్లే రహదారులకు గ్రావెల్ రోడ్లు నిర్మిస్తున్నారు. గ్రామస్తులు తమ అవస్థలను మంత్రి ఆర్కే రోజా దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించారు. మంత్రి తన ట్రస్టు ద్వారా గ్రావెల్ రోడ్లు వేయిస్తున్నారు. దీంతో మూడు గ్రామానికి చెందిన ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

అంకాళ పరమేశ్వరి సేవలో డిప్యూటీ సీఎం



గంగాధర నెల్లూరు: మండలంలోని అగరమంగళం గ్రామంలో వెలసిన శ్రీ గురప్ప అంకాళపరమేశ్వరి అమ్మవారిని డిప్యూటీసీఎం నారాయణ స్వామి, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ ఎంసీ విజయానంద రెడ్డి, పలమనేరు ఎమ్మెల్యే వెంకటే గౌడ శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అమావాస్య సందర్భంగా ఆలయంలో నిర్వహిస్తున్న మహాయజ్ఞంలో వీరు పాల్గొన్నారు.

కనుల పండువగా ఊంజల్ సేవ


ఊంజల్ సేవలో ద్రౌపదీ సమేత అర్జునస్వామి

పుత్తూరు: పట్టణంలోని ప్రసిద్ధ శ్రీద్రౌపదీదేవి సమేత ధర్మరాజులస్వామి ఆలయంలో శుక్రవారం అమామాస్యను పురస్కరించుకుని ఊంజల్ సేవను కనుల పండువగా నిర్వహించారు. వేకువ జామున శ్రీస్వామి,అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు. రాత్రి 7 గంటలకు అర్జునస్వామి, ద్రౌపదీదేవి ఉత్సవమూర్తులను పట్టు పీతాంబరాలు, విశేష ఆభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పాలతో సుందరంగా అలంకరించి ఊయలపై ఆశీనులను చేశారు. భక్తి కీర్తనల కచేరి నడుమ ఊంజల్ సేవ జరిగింది. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ ఛైర్మన్ లారీమోహన్ పర్యవేక్షించారు.

ప్రజల ఆరోగ్యానికే జగనన్న సురక్ష



కార్వేటినగరం: సురక్ష శిబిరంలో డాక్టర్ రవిరాజు, పాలసముద్రం: సేవలందిస్తున్న వైద్యులు

కార్వేటినగరం: ప్రజల ఆరోగ్యం పరిరక్షించడానికే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. మండల పరిధిలోని ఆర్కే వీబీపేట ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సర్పంచ్ దివ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వైద్యాధికారి రవిరాజు ప్రారంభించారు. వైద్యాధికారి మాట్లాడుతూ పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం సర్పంచ్ దివ్య మాట్లాడుతూ సీఎం చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష చరిత్రలో నిలిచిపోతుందని చెప్పారు. శిబిరంలో 270 మందికి వైద్య పరీక్షలు చేసి మందులను అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ పాండియన్, డాక్టర్ హేమశ్రీ, ఈవోపీఆర్డీ లక్ష్మీపతి, కార్యదర్శి లోకేష్, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

289 మందికి వైద్య సేవలు

పాలసముద్రం: ప్రభుత్వం పేదలకు పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టిందని సర్పంచ్ శోభత్యాగరాజ్ తెలిపారు. శుక్రవారం బాలక్రిష్టాపురం గ్రామ సచివలయం పరిధిలో వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ సమీక్షంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. అందులో 289 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు ఉచితంగా పంపిణీ చేశారు.

పేదల పక్షపాతి సీఎం జగన్


గ్రామస్తులతో మాట్లాడుతున్న నాయకులు

వెదురుకుప్పం: పేదల పక్షపాతి సీఎం జగన్ అని జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్ అన్నారు. మండలంలోని మాంబేడు పంచాయతీ దిగువగెరిగదొన గ్రామంలో శుక్రవారం సాయంత్రం పర్యటించి స్థానికులతో సమావేశమయ్యారు. ప్రభుత్వ ఫలాల లబ్ధి, స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రీ పేదల సంక్షేమం కోసం ఎలాంటి పథకాలు అమలు చేయలేదని గుర్తు చేశారు. జగనన్న ప్రభుత్వంలో ప్రతి పేదవాడికీ మేలు జరిగిందన్న విషయాన్ని మరిచిపోవద్దని చెప్పారు. అనంతరం వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు రామయ్య మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా బలహీన వర్గాల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నట్లు పేర్కొన్నారు. పేదల బతుకులు మారాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా సీఎం జగనన్నను చేసుకోవాలని కోరారు. ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. అంతకుముందు గ్రామ దేవత మాతమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యుడు వెంకటేష్, బొమ్మయ్యపల్లె సర్పంచ్ గోవిందయ్య, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు శివాజి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రోశిరెడ్డి, ఆర్‌బీకే ఛైర్మన్ కేశవులు, మాజీ సర్పంచ్ గోవిందన్, స్థానిక నాయకుల అమరనాథ్, చంద్ర, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకృతి సాగు పద్ధతులపై అవగాహన


క్షేత్రస్థాయిలో వివరిస్తున్న సిబ్బంది

నగరి: మండలంలోని ఎం.కొత్తూరు రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం నగరి, నిండ్ర, విజయపురం మండలాల్లోని ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి ఏటీఎం, ఎ గ్రేడ్ మోడల్స్‌ను అభివృద్ధి చేసే ప్రక్రియపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఆదేశాల మేరకు మాస్టర్ ట్రైనర్ చంద్రశేఖర్ అవగాహన కల్పించారు. రైతు హేమలత పొలాన్ని సందర్శించి ఏ గ్రేడ్ మోడల్, ఏటీఎం మోడల్‌లో సాగు చేసే ప్రక్రియను, విత్తనాలు విత్తే ప్రక్రియను ప్రత్యక్షంగా విశదీకరించారు. ఈ పద్ధతిలో సాగుచేసే రైతుల పంటను పరిశీలించి, వారి పరిస్థితిని క్షణ్ణంగా తెలియజేయాలని ప్రకృతి వ్యవసాయ ప్రోత్సాహక సిబ్బందికి ట్రైనింగ్ ఎన్ఎఫ్ఏ నాంచారమ్మ సూచించారు. ఆ రికార్డులను ఎలా తయారు చేయాలో శిక్షణ ఇచ్చారు. ఐదుగురు రైతులతో ఏ గ్రేడ్ పద్ధతిలో సాగు చేయించే ప్రణాళికను సిద్ధం చేశారు. మెంటార్ మంజుల, ప్రతాప్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వెట్టి చాకిరీ చేయిస్తే కఠిన చర్యలు


మాట్లాడుతున్న లేబర్ ఆఫీసర్ హేమాచారి

పుత్తూరు: బలహీన వర్గాల శ్రమ దోపిడీని అరికట్టేందుకే వెట్టి చాకిరి నివారణ చట్టం ప్రవేశపెట్టారని స్థానిక లేబర్ ఆఫీసర్ కె.హేమాచారి తెలిపారు. శుక్రవారం వెట్టి చాకిరి నిర్మూలనా వారోత్సవాల్లో భాగంగా గొల్లపల్లెలో ఇటుక బట్టీ వద్ద పుత్తూరు న్యాయ సేవాధికార సంస్థ, కార్మిక శాఖ సంయుక్తంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కుటుంబపరంగా, ఆచారంగా, ఒప్పందం మేరకు వంటి షరతులతో పనులు చేయిస్తే వెట్టి చాకిరీ కిందకు వస్తుందని తెలిపారు. 18 ఏళ్ల లోపు పిల్లలను పనిలో పెట్టుకోకూడదని స్పష్టం చేశారు. వెట్టి చాకిరిని పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇటుక బట్టీ యజమానులు, కార్మికులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రతో రక్తహీనత నివారణ





నగరి: చిన్నారికి మాత్ర వేస్తున్న ఎంఈఓ, కార్వేటినగరం: మాత్ర వేస్తున్న డాక్టర్ రవిరాజు, ఎస్సార్‌పురం: మాత్రలు వేస్తున్న వైద్యులు, పాలసముద్రం: మాత్ర మింగిస్తున్న డాక్టర్ మోహన్‌కృష్ణ

నగరి: ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగుల నివారణతో పాటు రక్తహీనత సమస్యల పరిష్కారమవుతుందని ఎంఈఓ శ్రీదేవి తెలిపారు. డీవార్మింగ్ డే సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను ఇచ్చారు. మండలంలోని గుడికండ్రిగ, దొమ్మరిండ్లు ఎస్టీ కాలనీ ప్రాథమిక పాఠశాలల్లో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో శ్రీదేవి పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్, ఏఎన్ఎం, సీఆర్పీలు పాల్గొన్నారు.

విజయపురం మండలంలో..

విజయపురం (నగరి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విజయపురం మండల వైద్యాధికారి సోమ శేఖర్ ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను శుక్రవారం పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నులిపురుగులతో ఎదుగుదలకు ఆటంకం

కార్వేటినగరం: పిల్లల కడుపులో నులిపురుగులు ఉంటే వారి ఎదుగుదలకు ఆటంకం కలుగుతుందని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు గుళికలు వేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ 19 ఏళ్లలోపు పిల్లలపై నులిపురుగుల ప్రభావం అధికంగా చూపుతుందన్నారు. ముఖ్యంగా అపరిశుభ్రత, కలుషిత ఆహారం తీసుకోవడం, బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన వంటి కారణాల వల్ల నులిపురుగులు సంక్రమిస్తాయన్నారు. పేగుల్లో మూడు రకాలైన ఏలిక పాము, కొంకిపురుగు, చుట్టపాము వంటి రకాలైన నులిపురుగులు సంక్రమించడానికి అవకాశం ఉందన్నారు. ఇది 5.5 అడుగుల వరకు పెరిగి 25 ఏళ్ల పాటు జీవిస్తాయన్నారు. ఇలాంటి నులిపురుగుల బారిన పడకుండా చేతిగోళ్లు కత్తిరించడం, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం కలుషిత ఆహారాన్ని తీసుకోకపోవడం ద్వారా నులిపురుగుల బారి నుంచి తప్పించుకోవచ్చని పేర్కొన్నారు. ఆల్బెండజోల్ గుళికల పట్ల అపోహలను వీడి ప్రతి ఒక్కరూ ప్రతి ఆరు నెలలకోసారి నులిపురుగుల గుళికలు తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని వైద్యాధికారి పిలుపునిచ్చారు. ప్రభుత్వ డిగ్రీకళాశాల, బాలికల ఉన్నత పాఠశాల, ఆర్కేవీబీ పేట, పాదిరికుప్పం, కత్తెరపల్లి, గంగమాంబాపురం, అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలకు నులిపురుగుల మాత్రలను పంపిణీ చేశారు.

ఎస్సార్‌పురంలో 3062 మందికి పంపిణీ

శ్రీరంగరాజపురం: నులిపురుగు నివారణే లక్ష్యం అని మండల వైద్యాధికారి డాక్టర్ సందీప్ అన్నారు. ఆయన మండలంలోని పుల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మండల విద్యాధికారి అరుణాచలంరెడ్డితో కలసి నులిపురుగు మందులు అందించారు. మండల వైద్యాధికారి డాక్టర్ సందీప్ మాట్లాడుతూ నులిపురుగు వ్యాధి సోకితే పోషకాహారం లోపం, రక్తహీనత, శారీరక, మానసిక అభివృద్ధిలో మందకొడిగా ఉంటారన్నారు. ఈ మందులు వాడడం ద్వారా ఈ వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చని అన్నారు. ఈ మందులు ప్రతి ఆరు నెలలకోసారి ఏడాది నుంచి 19 ఏళ్ల వయసున్న పిల్లలు తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు మండలంలో 3,062 మందికి మాత్రలను అందించినట్లు తెలిపారు.


జీడీనెల్లూరు: విద్యార్థినికి మాత్ర ఇస్తున్న డాక్టర్ దుర్గాదేవి

జీడీనెల్లూరులో 5,846 మాత్రల పంపిణీ

గంగాధర నెల్లూరు: చిన్నారులు, విద్యార్థుల్లో నులిపురుగుల నిర్మూలనే ప్రభుత్వం లక్ష్యమని డాక్టర్ దుర్గాదేవి అన్నారు. మండలంలోని జెడ్పీ హైస్కూల్ అలాగే మండల పరిధిలోని పలు ప్రభుత్వ,ప్రైవేటు స్కూళ్లలో విద్యార్థులకు నులిపురుగుల నివారణకు వైద్య సిబ్బందితో కలిసి డాక్టర్ దుర్గాదేవి ఆల్బెండజోల్ మాత్రను 5,846 మంది పిల్లలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ శ్రీనివాసులు, ధర్మేంద్ర, శైల, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మధ్యాహ్నం భోజనం తరువాతనే..

పాలసముద్రం: మండలంలోని బాలక్రిష్టాపురం ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగు మందులు పంపిణీ చేశారు. డాక్టర్ మోహన్‌క్రిష్ణ మాట్లాడుతూ ఈ మందులు మింగించడం వల్ల కడుపులో చిన్న చిన్న నులిపురుగులు నసించి పోయి పిల్లలకు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. మధ్యాహ్నం భోజనం తిన్న తరువాత మాత్రలను మింగించాలని తెలిపారు.

సార్వత్రిక ఎన్నికలకు పటిష్ట చర్యలు


మాట్లాడుతున్న నరసింహులు

సత్యవేడు: రానున్న సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణలో జరిగేలా అన్ని శాఖల సెక్టోరియల్ అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి(అసిస్టెంట్) నరసింహులు సూచించారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏడు మండలాల తహసీల్దార్లు, నియోజవర్గ పరిధిలోని ఎన్నికల సెక్టోరియల్ అధికారులుగా నియమితులైన వారితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామలకు పోలీసు బందోబస్తుతోపాటు లైవ్ వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. గత ఎన్నికల్లో అల్లర్లు, గొడవలు చేసిన వ్యక్తులు, నేర చరిత్ర కలిగిన వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. సీఐ దివాకర్ మాట్లాడుతూ ఎన్నికల విధులకు వెళ్లే సిబ్బంది గ్రామాల్లో నాయకులు ఇళ్లకు వెళ్లి భోజనాలు చేయకూడదని తెలిపారు. ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్లు కె.రామాంజనేయులు(సత్యవేడు), పి.శివశంకర్(నారాయణవనం), దయభారతి(వరదయ్యపాళెం), ఎం.శ్రీనివాసులునాయక్(కేవీబీపురం), ఎం.బాలకృష్ణన్(బీఎన్‌కండ్రిగ), ఎస్ఐ వీరాంజనేయులు, ఏడు మండలాల సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.